# వివర్ణం

చంద్రలత

అది అయిదోసారి ఆ చిత్రం వైపు సావధానంగా చూడడం. ఎందుకో తెలియదు.

కదలలేకపోతున్నాను

ఆ ప్రభావం రంగులదా? రేఖలదా?


వదలలేకపోతున్నాను.


అంత అద్భుతం అక్కడ ఆవిష్కరించబడిందా?

భుజాలెగరేశాను. పెదవి విరిచి ముందుకు కదిలాను.

అందమైన వరుసల్లో అమర్చి వుంచిన చిత్రాలను ఒక్కోదానిని నా డిజిటల్ కెమెరాలో బంధించేస్తూ...ముందుకు కదిలాను.

తిరిగి మళ్లీ అదే చోటికి..అదే చిత్రం ముందుకు వచ్చి నిలబడ్డాను.






అవే రంగులు...అవే రేఖలు...

సారూప్యమో...నైరూప్యమో....

వర్ణమో....వివర్ణమో....

నిశ్చలంగా వున్న నీటిపై గాలి అలలు రచించే నిశ్శబ్ద ప్రకంపనాల్లా...నాలో ఏదో తెలియని కదలిక.

లోలోన...

వెలుగులో...ఛాయలో....

కెమెరా కన్ను మూసేసాను...

వాచర్ బెంచి మీద కూర్చున్నాను. నెమ్మదిగా చిత్రం వంకే దృష్టి నిలిపాను. ఆమూలాగ్రం దృష్టి సారించాను.

ఎందుకని ఆ చిత్రం నన్నింతగా ఆకట్టుకొన్నది?

నాకే నవ్వొచ్చింది.

రోజూ ఎన్నెన్నో...చిత్ర కళాప్రదర్శనలకు వెళ్లడం... వాటిని రికార్డు చేయడం... ఎడిట్ చేయడం... రిలే చేయడానికి ఛానెల్‌కు పంపేయడం...నా నిత్యకృత్యం... ఒక రిపోర్టర్‌గా.. ఈ కళాభవన్‌లో ఎన్ని చిత్ర కళాప్రదర్శనలు చూశానో ఎందరెందరో కళాకారులను సన్నిహితంగా చూశానో...

అయినా ఈ చిత్రం నన్ను అమాంతం కట్టిపడేస్తున్నది.

అదే విచిత్రం!

ఓ కళావిమర్శకురాలిననీ... ఓ విలేఖరిననీ...మరిచిపోయేలా వుంది ఆ చిత్రం.

చిత్ర కళా స్వరూప స్వభావాల గురించీ...విమర్శ విశ్లేషణల గురించీ..నేను లోగడ చేసిన తర్కవితర్కాలన్నీ ఈ చిత్రపు ఉపరితలాన్ని తాకేట్టు లేవు.

ఆమూలాగ్రం పరిశీలనగా చూశాను.

ఓ గాజు బీకరు.

స్పెసిమన్లు సేకరించేది. సేకరించినవి భద్రపరిచి వుంచేది.

దానిలో ఇమిడ్చి వుంచిన ఓ స్త్రీ.

ఆమె కళ్లు అలవోకగా తెరిచే వున్నాయి. ఆమె ఒంటి రంగు, నేవళం, శరీర లావణ్యం ఆ గాజు ఉపరితలంలోంచి కనిపిస్తూనే వున్నాయి. ఆమె నాజూకు అరచేతులు ఆ దళసరి గాజుగోడని అదిమి వేస్తూనే వున్నాయి. ఆమె నిడుపాటి కురులు అలలు అలలుగా తడిలో తేలియాడుతూనే వున్నాయి.

ఆమె ఊపిరి పీలుస్తున్న ధ్వని నాకు వినపడసాగింది. నిశ్శబ్దంగా...

ఆమె గుండెలయ సన్నటి ప్రకంపనాలను సృష్టిస్తోంది. నిగూఢంగా...

ఏదో తెలియని భావం నన్ను నిలువునా కుదిపేసింది.

ఇలాంటి గాజు బీకరు నాకు బాగా పరిచయం వున్నట్లే అనిపించింది.

నిజమే, నాకు జ్ఞాపకం వస్తోంది. అచ్చం ఇలాంటి గాజు బీకరును నేను ఎరుగుదును.

రెండు దశాబ్దాల క్రితం సంగతి.

అప్పట్లో మా పాలమూరులో సైన్స్ ఫెయిర్ పెట్టడం ఓ పెద్ద వింత, విశేషం.

ఆ సందర్భంగా గీతా టీచర్ మా బడికి సరిగ్గా ఇలాంటి గాజు బీకర్లనే తీసుకువచ్చారు. పెద్దవి... చిన్నవి... దళసరివి... పలుచటివి... నిలువులోటాల్లాంటివి... పైన మూతపై గాజుగోళీ.

అప్పుడే మొదటిసారిగా చూసింది.

పాములు, కప్పలు, బొద్దింకలు!! అబ్బా - యాక్! ఓ అమ్మాయి కళ్లు తిరిగి కింద పడిపోయింది.

మూత్రపిండాలు, మెదడు, గుండె... ఒక్కటేమిటి... ఏకంగా ఓ కంకాళమే తెచ్చి పెడితే!

అమ్మో ఆ దడుపు ఆగడానికి ఎన్నాళ్లు పట్టిందో!

వద్దు మొర్రో అంటే వినకుండా తననూ అపర్ణనూ బయాలజీ టీచర్ తన గ్రూప్‌లో పెట్టేశారు.

జీవరహితమైన ఆ శరీర భాగాలు, సరీసృపాలు, క్షీరదాలు, కీటకాలు ఒక్కో గాజు బీకరు ద్రావకంలో తేలుతూ వుండిన దృశ్యాలు- ఎన్నాళ్లో పీడకలలుగా వెంటాడి వదిలేవి కావు. ఆ ద్రావకపు ఘాటైన వాసన ఇంటికి వెళ్లి తలారా స్నానం చేసినా వదిలేదా? అసలు అన్నమే సహించేది కాదు. అమ్మతో చివాట్లు తప్పేవి కావు.

కప్ప నోట్లో పొగాకు కుక్కి కార్డు బోర్డుపై వెల్లకిలా పడుకోబెట్టి కాళ్లు చేతులకు శీలలు కొట్టి అది బ్రతికి వుండగానే నిలువునా కోసి ప్రదర్శనలో పెట్టడం...అబ్బో!

బయల్పడిన దాని అవయవాలు-కొట్టుకుంటున్న దాని చిన్ని గుండె తడి- ఈ రోజుకీ కళ్లల్లో మెదులుతుంది. కడుపులో కెలికినట్లవుతుంది.

గీతా టీచర్ అంతటితో వూరుకుంటే బాగానే వుండేదేమో-తననీ అపర్ణనీ ఆ గాజుబీకర్లనన్నిటినీ సర్దే పనికి పురమాయించింది.

మూడు రోజుల ఆ ప్రదర్శనలో రోజూ ఉదయాన్నే బల్లలపై వాటన్నిటినీ సర్దడం-మళ్లీ సాయంత్రం అద్దాల బీరువాల్లో సర్దేసి తాళాలు వేయడం తమ పని.

చివరి రోజున-

హృదయం పెట్టిన బీకరును జాగ్రత్తగా మోసుకు వస్తూ ఎదురు దెబ్బ దగిలి ధామ్మని ముందుకు పడింది అపర్ణ.

బీకరు ముక్కలయింది. ద్రావకం గదంతా చిమ్మింది.

గాజుముక్కలు హృదయంలోకి గుచ్చుకుపోయాయి.

అపర్ణ మోకాలు చిట్లింది. మోచేయి డొక్కుపోయింది. నుదురు చిట్లింది.

ఘాటైన ఆ వాసనకి కడుపులో తిప్పుతుంటే-

టీచర్ చీవాట్ల మధ్య బెక్కుతూ బెక్కుతూ-వంటరిగా నేలమీద కూర్చుని అపర్ణ ఒక్కో గాజు ముక్కలను ఏరడం ఇంకా గుర్తుంది. కన్నీటితో అతుక్కున్న ముంగురులు, బిక్కముఖం.

గుండెల్లో గుచ్చుకున్న ఆ సన్నటి గాజు ముక్కలను జాగ్రత్తగా తీయాలని ప్రయత్నించిన కొద్దీ-జీవరహితమైన ఆ హృదయం - ఛిద్రమై ఛిన్నాభిన్నమైంది.

ఆ దృశ్యం నన్ను వెన్నాడుతూనే వుంది. ఆ ఘాటైన వాసన రసాయనపు వాసనలా.

తల విదిల్చాను. మెల్లగా లేచి నిల్చున్నాను.

'కావచ్చు.. బహుశా ఆ జ్ఞాపకం వలనే ఈ చిత్రం నన్ను ఆకట్టుకొని వుండొచ్చు.

నెమ్మదిగా లేచి చిత్రానికి దగ్గరగా వెళ్లి నిల్చు

న్నాను.

ఇప్పుడు ఏ వుద్వేగం లేకుండా ఆ చిత్రాన్ని చూశాను.

అవును.

అది ఒక సాధారణమ్మైన బీకరు.

ఆమె ఒక సామాన్యమ్మైన స్త్రీ.

చిత్రకారుల సంతకం కోసం వెతికాను.

లేదు.

కళాకారుల పైత్యప్రకోపాలు నేను ఎరుగనివా? చీటికి మాటికి బుంగమూతి పెట్టే పిల్లల్లాంటి వాళ్లు! నేను ఆ ఎగ్జిబిషన్ వాలంటీర్‌ను కలిశాను - ఆ చిత్రకారుల ప్రొఫైల్ ఇవ్వమని.

''సారీ... అది వ్యక్తిగతం. ఎవరికీ ఇవ్వకూడదని వారి కోరిక'' ఆమె సున్నితంగా తిరస్కరించింది.

జేబులో నుంచి నా ఐడెంటిటీ కార్డ్ తీసి ఆమెకు ఇచ్చాను.

''ప్రెస్!'' అన్న ధీమాగా.

ఎవరికీ ఇవ్వకూడదని కోరడంలోనే వుంది-నాలాంటి వాళ్లని దూరంగా వుంచాలన్న కోరిక! కళాకారుల చిత్తప్రవృత్తులు నేను ఎరగనివా? క్షణక్షణముల్ అని- ఏకాంతంలో ముడుచుకు పోయిన వారెందరు బహిర్గతం కాలేదు? చిన్న ప్రయత్నం ఫలిస్తే సరేసరి! కానీ. ఈ పూజారి వరమిస్తే కదా' ఆ వాలంటీర్ వంక చిరునవ్వుతో చూస్తూ ఉన్నా.

ఆ అమ్మాయి కాస్త తటపటాయించి, కాసేపు నన్ను ఎగాదిగా చూసి-నా కార్డు నా చేతికి ఇచ్చేసి-వెనక్కు తిరిగి వెళ్లింది. నేను జేబుల్లో చేతులు పెట్టుకుని అంకెలు లెక్కపెడుతూ నిల్చున్నాను.

వెళ్లినంత వేగంగా ఆ అమ్మాయి తిరిగి వచ్చింది. వస్తూ వస్తూ ఆ చిత్రకారుల పేరు, చిరునామా పట్టుకొచ్చింది.

లోపల ఎంత కుతూహలంగా వున్నా ఆత్రుతను అదిమిపెట్టి - గంభీరంగా ఆ కార్డును తీసుకొన్నాను.

అపర్ణా రంజిత్!

విచిత్రం!!

ఇదేదో అభూతకల్పనలా వుందే!

ఈ అపర్ణ మా అపర్ణేనా?

ఎక్కడి పాలమూరు? ఎక్కడి ఇంద్రప్రస్థపురం?

నా ఆసక్తి రెండింతలయ్యింది.

ఆ... అయినా. ఉత్తరాది వాళ్లలో ముఖ్యంగా బెంగాలీలలో అపర్ణ పేరు సర్వసాధారణం. అయితే మాత్రం, ఆ పేరు చాలదా స్నేహభావం మొలకెత్తడానికి?

''నేను ఆవిడను కలవచ్చా?' ఆ అమ్మాయిని మళ్లీ అడిగాను-నాలోని ఉత్సాహాన్ని కాస్త అణచి పెడుతూ...

''ఆమె సాధారణంగా ఎవరికీ ఇంటర్వ్యూ ఇవ్వరు. ఎందుకయినా మంచిది ముందుగా కనుక్కొని వెళ్లండి''

''థ్యాంక్యూ!'' హుషారుగా ఆ అమ్మాయికి షేక్‌హ్యాండిచ్చి నా సరంజామాతో బయలుదేరా... సంబరంగా

నేరుగా అపర్ణ ఇంటికి.

చిన్నపిల్లలా...

***

అపర్ణ వాళ్ల ఇంటి తలుపు తెరుచుకోనే లోగా- ఆ ఉద్వేగం ఉవ్వింతలయ్యింది. ప్రొఫెషనల్ లుక్ ముఖానికి అతికించుకోవడానికి కాస్త శ్రమ పడాల్సి వచ్చింది.

ఎన్నిసార్లు నుదుటికి పట్టిన చిరు చెమటను తుడుచుకొన్నానో- ఎన్ని మార్లు చేతివేళ్లు విరుచుకున్నానో- ఇంకెన్ని సార్లు పెదవులు తడి చేసుకొన్నానో- నాకే తెలియదు.

అదుగో-తలుపు తెరుచుకొంటోంది.

దబాలున తెరిచేసింది. నా ఎదురుగా నిలబడిన ఒక రెండు జడల నడి వయసు స్త్రీ. బహుశా పనిమనిషో, వంటమనిషో అయి వుండవచ్చు. పంజాబీ యాసలో పలుకరించింది.

బీబీజీని పిలవమన్నాను.

ఓ మారు నన్ను ఎగాదిగా చూసి, ఆమె లోపలకి వెళ్లింది. తలుపును గట్టిగా బిగించి.

నా వాలకం చూసి ఏ సబ్బులో పౌడర్లో అమ్మే వాళ్లనుకుందేమో-పాపం!

చాలాసేపు ఆమె తిరిగి రాలేదు. ఔననలేదు. కాదనలేదు. చేసేది ఏముంది? ఆ గుమ్మం ముందు అసహనంగా పచార్లు చేస్తున్నాను.

మనీ ప్లాంట్ జాలీ నిండుగా అడ్డదిడ్డంగా పెరిగిపోయి వుంది. దాని చాటుగా నేమ్ ప్లేట్ - కె.ఆర్. రంజిత్ కుమార్. ఓహో..అపర్ణ వాళ్లాయన మిలటరీలో గ్రేడ్ వన్ ఆఫీసరన్నమాట!

తలుపు తెరుచుకున్న శబ్దానికి గిరుక్కున తిరిగాను.

శ్రద్ధగా మలచిన చిత్రం లాంటి చక్కని యువతి.

ఆమె అపర్ణ కావచ్చు.

నిస్సందేహంగా- మా అపర్ణ కాదు.

ఆమె అపర్ణే... అపర్ణా రంజిత్

''నమస్తే'' మర్యాదగా పలకరించాను. వచ్చిన పని చెప్పాను. ఎలా వచ్చానో చెప్పాను. ఆమె విశాలమ్మైన కళ్లల్లో ఎలాంటి కుతూహలం కనపడలేదు. నిర్లిప్తత ఓ నీలినీడలా ఆ కళ్లలోంచి ఆమె ముఖంలోకి విస్తరించింది. అది నా భ్రమే కావచ్చు కాక!

తలుపు ఓరగా తీసి, తల మాత్రం బయటకు పెట్టి నన్ను పలకరించిన ఆమె నన్నింకా లోపలకి రమ్మని ఆహ్వానించలేదు. కనీసం ఆహ్వానభరితమైన చిరునవ్వు కూడా లేదు.

నేను కాస్త వెనకా ముందాడుతూ నిల్చున్నాను.

ఇలాంటి అవాంఛిత ఆహ్వానం నాకు కొత్తేమీ కాదు. రవి కాంచని చోట విలేకరి చొరబడున్ కానీ. ఎలా చొచ్చుకు పోవడమా అని- ఆలోచిస్తున్నాను.

నా ఆలోచనలు నా ముఖాన ప్రతిఫలించకుండా చెదరని చిరునవ్వుతో నిల్చున్నాను. ''అవని'' ఆమె అడగకుండానే నా పేరు కూడా చెప్పేశాను... ఊహూ! అపర్ణ నుంచి ఎలాంటి ప్రతిస్పందన రాలేదు. మర్యాదకైనా...

## సెలీనా గిఫ్ట్

బాల్యంలోకి పరిగెత్తడమంటే ఎవరికి మాత్రం ఇష్టం ఉండదు. చేజారిన బాల్యాన్ని తిరిగి పొందలేకపోవచ్చు కానీ... ఆ రోజుల్లో గడిపిన భవంతిని చేజార్చుకోకూడదని బాలీవుడ్ భామ సెలీనా జైట్లీ భావించింది. అదీ తన తల్లి కోసం. వివరాల్లోకి వెళితే.. సెలీనా తాత ఎరిక్ ఫ్రాన్సిస్ ఆర్మీ ఆఫీసర్‌గా కొన్ని సంవత్సరాలు గోవాలో ఉన్నారు. పోర్చుగీసు వారు ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకుంటున్న సమయంలో ఆయన పోరాటాన్ని సలిపారు. అక్కడే ఓ అందమ్మైన భవంతిని కొనుగోలు చేసి అందులో నివసించారు. ఆ తర్వాత ఆయన పాకిస్థాన్‌కు వెళ్ళాక ఆ భవంతి చేతులు మారింది. సెలీనా తల్లికి ఆ భవంతితో ఎంతో అనుబంధం ఉంది. తన తల్లి బాల్యమంతా గడిచిన ఆ భవంతిని తిరిగి పొందాలని సెలీనా జైట్లీ భావించింది. ఇటీవల తన కుటుంబ సభ్యులతో గోవాకు వెళ్ళి ఆ పోర్చుగీస్ విల్లా వివరాలను తెలుసుకుంది. తన తాతగారి జ్ఞాపకంగా ఈ భవంతిని కొని తల్లికి కానుక ఇవ్వబోతున్నానని తెలిపింది.



అపర్ణ నెమ్మదిగా తలుపు వేసింది.

నేను తలవాల్చి నిల్చున్నాను. తలుపు ముందున్న తడిమెట్లపై.

ఆమె తిరిగి వస్తుందని నాకెందుకో బలంగా అనిపిస్తోంది. చెవులు రిక్కరించాను. తలుపు గడి తీసిన శబ్దమో.. ఆమె పాదాల సవ్వడో వినపడుతుందని

ఊహూ!

ఇక లాభం లేదని వెనక్కి తిరిగాను.

ఆ ఇంటి ఎదురుగా వున్న అంగడి దగ్గర ఆగాను. ఏం తీసుకుందామా? అని ఆలోచిస్తూ అక్కడి అరల్లో అమర్చిన వస్తు సమూహాన్ని, తిండి పదార్థాలని గమనిస్తూ నిల్చున్నాను.

ఇంతలో ఎవరో నా భుజాన తట్టి పలకరించబోయారు.

నా ఊహ నిజమే.

అపర్ణ.

తనతో రమ్మన్నట్టుగా సైగ చేసింది.

నేను ఆమె వెనకగా నడిచాను.

రెండు మలుపులు తిరిగాక వీధి మూలగా వున కాలనీ పార్క్ వద్ద ఆమె ఆగింది.

ఇద్దరం లోపలకి నడిచాం. పక్కపక్కనే కూర్చున్నాం. మౌనంగానే.

బడి సమయం. పిల్లలు లేని ఊయలలు, జారుడు బండలు. అక్కడక్కడా మొలిచిన గడ్డి. గోడ వారగా పెంచిన ఫెన్సింగ్ మొక్కలు.

ఎప్పుడో బర్రుమంటున్న వాహనం.

తోపుడు బండి వ్యాపారుల కేకలు.

అంతా నిశ్శబ్దంగా వుంది. మా ఇద్దరి మధ్యనా వున్నట్లే.

ఆ మౌనంలోనే మా ఇద్దరి నడుమ చక్కటి అవగాహన కలిగింది.

ఆమె ఏదో చెప్పడానికి సిద్ధమయి వచ్చింది.

ఆమె చెప్పబోయేది వినడానికి నేను సిద్ధమయి వున్నా.

వృత్తి నేర్పిన మెళకువో నా సహజ స్వభావమో - మొదట నేనే మాట్లాడడం మొదలు పెట్టాను. అపర్ణ పేరు నాలో కలిగించిన స్నేహభావాన్ని గురించి. మా చిన్ననాటి ముచ్చట్ల గురించి, మేం పెద్దలను పెట్టిన ముప్పతిప్పలను గురించి, ఆడిన ఆటల గురించి, పాటిన పాటల గురించి.

ఆమెకు నా వయసే వుండొచ్చు. ఆమె అపర్ణే కావచ్చు.

అవేవీ కావు. అయితే అలా కాకపోవడం మా నడుమ స్నేహభావాన్ని సాన్నిహిత్యాన్ని మొలకెత్తించడంలో అడ్డంకులేవీ కాలేదు.


ఆమె భర్త మిలటరీలో గ్రేడ్ వన్ ఆఫీసర్. పిల్లలు ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేయబోతున్నారు. డెబ్బయ్యివ దశకం ఆరంభంలోనే ఆమె తన మెడిసిన్‌ను పూర్తి చేసింది. ఇదీ ఆమె ముఖ పరిచయం. ఇక ముఖాముఖిన ముఖ్యమైన విషయాల్లోకి వెళ్లాలి. ఆమెకు నాపై ఒక సానుకూలత కలిగేటట్లుగా నా సంభాషణ పొడిగించసాగాను.

ఎన్నెన్నో రంగులను ఆవిష్కరించిన ఆమె సున్నితమైన చేతి వేళ్లు నలిగిపోతున్నాయి. ఆమె ఆలోచనల ఉద్వేగంలో... ఆమె ముఖం కందిపోతున్నది.

అపర్ణ మాట్లాడడం మొదలుపెట్టింది.

నాతో పంచుకోవడానికే ఆ మాటలన్నింటిని ఇన్నాళ్లుగా తన గుండెల్లో మూటగట్టి వుంచిందేమోనన్నంత ఉద్వేగం- ఆమె పలుకుల్లో ధ్వనిస్తోంది.

ఏ చిన్న కదలిక అయినా ఆమెను ఆపివేస్తుందేమోనన్నట్టుగా నేను మెదలకుండా కూర్చున్నాను.




చెవులను, కనులను అపర్ణకు అప్పగించి. చాలా శ్రద్ధగా ఆమె మాటలను వినడం ప్రారంభించాను. ఒక్కోమాట నా ప్రమేయం లేకుండానే నా మనసులోకి ఇంకిపోసాగింది. కాగితం పైకి సిరాచుక్కలా.

''పోనీలే అనుకున్నా...''

అపర్ణ అంది - '' ఇదంతా మామూలే...నేను సున్నితంగా స్పందిస్తున్నానేమోననీ...! కానీ, అలా అనుకుంటూ ఎక్కువ కాలం ఉండలేకపోయాను... ''

***

మేం నలుగురం పిల్లలం. నాన్న బడిపంతులు. అమ్మ గృహిణి. మమ్మల్ని అమ్మ చాలా గుట్టుమట్టుగా పెంచుకొచ్చింది.

నాన్న ఓ ప్రగతివాద పార్టీలో చాలా సాధారణమైన కార్యకర్త. అయినా, పార్టీ కార్యకలాపాలకు మా ఇల్లు ఓ కేంద్రంగా వుండేది. అదేదో ముఖ్యమైన విషయంలా ఇంట్లో వాళ్లం ఎవరం అనుకునే వాళ్లం కాదు. అది మా జీవితంలో ఓ భాగంలా కలిసిపోయింది. మేము విడదీసి చూసేవాళ్లమే కాదు. ఎప్పుడూ వచ్చేవాళ్లు. పోయేవాళ్లు. ఇల్లంతా సందడి. పిల్లలుగా మాకు సరదాగానే వుండేది. అయితే మా నలుగురి కడుపునింపడానికే కిందా మీదా పడుతోన్న మా అమ్మ ఈ అతిథుల తాకిడికి విలవిలాలాడేది. ముప్పతిప్పలు పడైనా వారి అవసరాలు తీర్చేది. కానీ, వాళ్లెవరూ అమ్మ ఎలా వారి పళ్లెం నింపుతోందో ఆలోచించారని నేను అనుకోను. వారి ఆకలి తీర్చడానికి రొట్టె, పప్పు అందేవి నిరాఘాటంగా.

అన్నయ్య మెడిసిన్‌లో చేరాడు. మాకు ఇక అన్ని సమస్యలు తీరిపోతాయనుకొన్నాం. ఇంతలో, అన్నయ్య ఉద్యమంలో చేరాడు. అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఎప్పుడో ఎవరో స్నేహితుల ద్వారా వార్తలు చేరేవి. క్షేమంగా వున్నాడని.

ఓ తెల్లవారుఝామున అతనే తిరిగి వచ్చాడు. డస్సిపోయినట్లుగా వాకిట్లో పడి వున్నాడు. అతను మామూలు మనిషి అయ్యేసరికి మా అందరి తలప్రాణాలు తోకలకొచ్చాయి.

ఇంతలో పార్టీని నిషేధించారు. అన్నయ్య మెడిసిన్‌లో చేరాడు. పూర్తిచేయాలని సంకల్పించాడు. అయితే, మా ఇంటి నుండే తన కార్యకలాపాలను కొనసాగించేవాడు.

కుటుంబ సభ్యులందరమూ చాలా ఉత్సాహంగా పాల్గొనే వాళ్లం. ఏ చిన్నపని చేయగలిగినా ఘనకార్యం చేసినట్లుగా ఉప్పొంగిపోయేవాళ్లం.

అప్పటికి నేను చిన్నపిల్లని కదా... అన్నయ్య అతని స్నేహితులు నన్ను చిన్నపిల్లలాగానే గారాబం చేసేవారు. కళ్లంతా విప్పార్చి వాళ్ల కబుర్లు వింటూండేదానిని.

ముఖ్యంగా స్త్రీల గురించి, వారి సమానహక్కుల గురించి వారు మాట్లాడుకుంటుంటే చాలా సంతోషం వేసేది. సమభావనలతో నిండిన ఒక సంస్కార సమాజం ఆవిష్కరించాలని వారంతా ప్రతిజ్ఞలు చేసుకుంటుంటే ఎంత గొప్పగా అనిపించేదో! నాలో నేను ఎంతో ఉత్తేజితురాలినయ్యేదానిని.

వారి ఆదర్శాల కలలు రంగుల్లో సాగేవి. అన్నయ్య స్నేహితులు ఎక్కువగా కవులు, ఉపన్యాసకులే అయినా, గాయకులు, చిత్రకారులు కూడా వుండేవారు. ఎంత సరదాగా వుండేదో వారి రాకపోకలతో! వారు వస్తూ వస్తూ చక్కటి బౌండు పుస్తకాలను, అందమైన ముద్రణలతో నిండిన పత్రికలను తమతో తీసుకువచ్చేవారు.

నిజానికి, వాటిల్లో మాకు తెలిసిన ప్రదేశాలు కానీ, మనుషులు కానీ లేవు. ఆ చెట్టు, పక్షులు, పువ్వులు, జంతువులు - మనం ఎప్పుడూ చూడలేదు. ఆ కథలు పాత్రలు, స్వభావాలు మనకు తెలియదు. వారి జానపదాలు, పండుగలు, నమ్మ

కాలు, వ్యవహారాలు – మనవి కావు.

అయినా, ముట్టుకుంటే మాసిపోయే మిలమిలాడే కాగితాలపై రంగు రంగుల వర్ణచిత్రాలు నన్ను ఆకర్షించేవి. బొమ్మలు గీయడం గురించీ, రంగులద్దడం గురించీ తరచూ ఆ పుస్తకాల్లో వ్రాసేవారు. అలా ఎప్పుడు నా చేతిలోకి కుంచె వచ్చిందో నాకే తెలియదు.

ఆ పుస్తకాల్లో విమానాలు నడిపే స్త్రీలు, ఆకాశంలోంచి అంతరిక్షంలోకి దూసుకుపోయిన మహిళలు, జిమ్నాస్టిక్ చేసే అమ్మాయిలు ఈతలు కొట్టే అతివలూ ఎందరెందరో వుండేవారు. ఎంత వెతికి చూసినా అమ్మలాంటి వాళ్ళు, నాలాంటి వాళ్ళు, చెల్లెలి లాంటి వాళ్ళు వుండేవారే కాదు.

అన్నయ్యా, ఆయన స్నేహితులు ఆ అమ్మాయిల పొడవాటి కాళ్ళ గురించి, నునుపైన చేతులు గురించి, బుగ్గల నేవళం గురించి, కళకళలాడే ముఖాల గురించి బోలెడన్ని చిలిపి కబుర్లు చెప్పుకునేవారు. అమ్మా నాన్న అటు వచ్చారో వారంతా గప్‌చుప్!

నాకు ఆ అమ్మాయిల ముఖంలోని ధీమా నచ్చేది. అద్దం ముందు నిలబడి నేనూ వాళ్లలా గడ్డం పైకెత్తి, సూటిగా చూస్తూ, చక్కగా నవ్వడానికి ప్రయత్నించే దానిని.

ఆ రోజులు ఎంత బావుండేవో- ఎన్ని రోజులు చిలకడ దుంపలతో పూటలు గడిపినా, ఉడకేసిన వేరుశనగలో, ముల్లంగి దుంపలో ఆకలి తీర్చినా, సంతోషంగానే అనిపించేది.

ఇంతలో అన్నయ్యకు ఒక పెళ్లి సంబంధం వచ్చింది. మా దూరపు బంధువుల అమ్మాయి. అతి కష్టంపై ప్రాథమిక విద్య పూర్తి చేసింది. అంతలోనే ఆమె వివాహం. కాపురానికి వెళ్లకముందే కాలువలో మునిగి ఆమె భర్త కాలం చేశాడు.

ఆదర్శ వివాహం అని వెంటనే ఒప్పుకున్నాడు అన్నయ్య. నిజానికి అమ్మానాన్నలే ఒప్పించారని అనాలి. ఆమె, మా వదిన, పాతిక ఎకరాల మాగాణితో, ఏడువారాల నగలతో మా ఇంట్లో అడుగుపెట్టింది. రెండో వివాహం అన్న స్పృహ వల్లనో- ఆదర్శ వివాహం అన్న కృతజ్ఞతలో మునిగో- ఏమీ ఎరగని అమాయకత్వం వల్లనో- మా లక్ష్మీ వదిన అణిమణిగి వుండేది. తడిసిన పిల్లిలా, ఏదో మూలన ముడుచుకుంటూ- తన పాదాల సవ్వడి తనకే వినబడేనంతగా మెత్తగా నడుచుకుంటూ

వదిన పంటసొమ్ముతో కుటుంబమంతా కుదురుకున్నాం. అమ్మానాన్న కూరగాయల తోటలు వేశారు. మెల్లగా వ్యవసాయం మొదలుపెట్టారు. మేమంతా చదువుకోగలిగాం. ఇంటిపై జమ్ము కప్పు తీసేసి స్లాబ్ వేసుకున్నాం. ఇంట్లోకి ఒక్కో వస్తువూ అమర్చుకోసాగాం.


ఇలాంటి సమయంలో అన్నయ్య ఇంటిపై పిడుగు వేశాడు. ఎలాంటి ఉరుములు మెరుపులు లేకుండానే.

తను సౌదీకి వెళుతున్నాననీ, వదినను తనతో తీసుకెళ్లడం వీలుకాదని.

ఏదో ఉన్న ఊళ్లో ఉద్యోగం చేసుకుంటూ అందరికీ ఆదరువు అవుతాడనుకున్న అన్నయ్య ఇలాంటి నిర్ణయం తీసుకోవడం – త్వరగా మింగుడు పడలేదు. నాన్న ఉద్యోగ విరమణ చేశాడు. వయసు మీద పడుతూ వుంది. చిన్నా చితక పనులు ఒంటరిగా చేయలేకపోతున్నాడు.

లక్ష్మీ వదిన రెండో మారు గర్భవతి. వళ్లో పిల్లాడు.

అందరం విమానాశ్రయానికి వెళ్లాం. అక్కడ తెలిసింది. అన్నయ్య మాకోసం వుంచిన అసలు




ఉత్పాతం!

ఆయన వంటరిగా వెళ్లడం లేదు. తన ఉద్యమ నేస్తం, సహధ్యాయినితో వెళుతున్నాడు. మతం మార్చుకొని మరీ! ఆమె చేతిలోనూ ఒక బిడ్డ. వదిన బిడ్డకన్నా ఒక ఏడాది పెద్దదీ!

అంతే!

ఎక్కడవారమక్కడ నిర్ఘాంతపోయి నిలబడిపోయాం!

అన్నయ తెలియక చేశాడని ఎలా అనగలం?

తెలిసి తెలిసీ ఇద్దరు స్త్రీల జీవితాల్లో ఇలాంటి అనుభవం మిగల్చడం-ఛా!

అమ్మానాన్నలు కుప్పకూలిపోయారు.

అటు కోడలు- ఏమీ తెలియని అమాయక బైతు.

ఇటు కొడుకు-అన్నీ తెలిసిన ఉద్దండుడు.

వీరిరువురికి అతీతంగా ఎన్నో తెలిసిన విద్యావతి.

ఏమి అనుకొని ఏం ప్రయోజనం! ఇలాంటి అనూహ్య పరిస్థితి వస్తుందని ఎవరికి తెలుసు?

అందులోనూ అన్నయ్య...! ఇలాంటి నిర్వాకం చేస్తాడని ఎలా ఊహించగలం? స్త్రీల మనోభావాల గురించి ఎంత అందంగా మాట్లాడేవాడో...! ఇద్దరు స్త్రీల నడుమ ఎలాంటి కఠినమైన మనో వేదనకు కారణభూతమయ్యాడు!

మెల్లిమెల్లిగా విషయాలు తెలిసాయి. లక్ష్మి వదిన ఏడువారాల నగలూ ఒక్కొక్కటిగా అన్నయ్య తీసుకెళ్లిపోయాడు! వదిన సొమ్ముతోనే మరొక కాపురాన్ని తీర్చిదిద్దుకున్నాడు ! ఛీఛీ!

ఎంత అమాయకురాలైనా వదినకు మాత్రం అనుభూతులు లేవా? ఆలోచనలు వుండవా? ఆదర్శమని గొప్పగా చేసుకున్న ఆమె రెండవ వివాహం- మా అందరి సాక్షిగా ఇలా నిప్పుల గుండమై నిలిచింది.

అన్నయ్య ఆదర్శ వచనాలు ఒక్కోటి గుర్తుకొచ్చి మరింత కుంగిపోయాం. అతని నోట వొలికిన ఆ ఉన్నత భావాలే మెత్తని కొరడాల్లా మమ్మల్ని తాకేవి. తలుచుకొన్న కొద్దీ కంపరం... దిగులు... విషాదం

అన్నయ్య వెళ్లిపోయాడు.

వదిన బిడ్డలతో సహా మా ముందు నిలబడింది.

ఆమె ఏ అఘాయిత్యం చేసుకుంటుందేమోనన్న భయం. ఆమెకు జరిగిన అన్యాయం తలుచున్నప్పుడల్లా దుఃఖం.

అలాంటప్పుడు పార్టీ కానీ, పార్టీ మిత్రులు కానీ మాకు ఎలాంటి నైతిక బలాన్ని ఇవ్వలేదు. వెన్నుదన్నుగా నిలవలేదు. పూర్తిగా నిర్లిప్తత చూపింది. మౌనం వహించింది. అలా తన ఆగ్రహాన్ని ప్రకటించేసింది. అందరి రాకపోకలు ఆకస్మికంగా ఆగిపోయాయి. కొత్తల్లో నాన్న ఊపిరి ఆడనట్లు ఉక్కిరిబిక్కిరి అయ్యేవాడు. ఆ ఆదర్శ ప్రపంచమే ఆయన ఆయువు పట్టని మాకు అర్థమైంది. ఆయన ఆయనలా లేడు. తన నమ్మకాలకు దూరంగా నెట్టివేయడంతో విలవిలలాడిపోయాడు. అన్నయ్య చేసిన తప్పుకు తనే బాధ్యత వహించాడు. నడిచే శవంలా తయారయ్యాడు.

క్రమక్రమంగా పార్టీ కార్యకలాపాలకు మేము దూరంగా జరిగిపోయాం. లోలోపలకి కుంచించుకు పోయాం. చిప్పల్లోకి ముడుచుకు పోయే తాబేళ్లలా.

లోపల చితికిపోతూ పైకి గంభీరంగా తిరుగాడసాగాం.

అన్నయ్య నిర్వాకం అటుంచి తన పార్టీ వారంతా తన జీవిత కాలపు శ్రమను విధేయతను ఒక్క వేటుతో వెలివేసినట్లుగా ప్రవర్తించడం నాన్నకు కొరుకుడుపడలేదు. ఎందరినో ఆశయాల బాటలో తీర్చిదిద్దిన నాన్న అన్నయ్య ప్రవర్తన వలన దోషిలా పక్కకు తోసేయడాన్ని జీర్ణించుకోలే

కపోయాడు. ఇది దెబ్బ పై దెబ్బ.

నేను ప్రాక్టీసు మొదలుపెట్టాను. చాలా చిన్న క్లినిక్. నా సీనియర్ ఆనంద్ నాకు ఎంతో సహాయం చేసేవాడు. అప్పుడప్పుడు వచ్చి కేస్ డిస్కషన్స్ చేసేవాడు. అన్నయ్య గురించీ మాట్లాడేవాడు. మాకు అన్నయ్య సీనియర్. కాలేజీలో ఎందరెంద రికో ఆదర్శాలను నూరిపోసినవాడేగా!

ఆనంద్ నచ్చజెప్పడానికి ప్రయత్నించేవాడు.

ఎన్ని చెప్పినా పెదవులు దాట ని ఆదర్శాలు, అబద్ధాల అతుకుల బతుకు నాకు నచ్చలేదని నిక్క చ్చిగా చెప్పేశాను. ఏ ఆదర్శాల పాలు తాగి పెరిగాడో ఏ భావజాలం అతనిని పెంచిందో దాని నుంచి అర్థాంతరంగా పారిపోవడం-అందనంత దూరంగా పారిపోవడం-అస్సలు నచ్చలేదు. మత తత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తూ- అటు ఉద్యోగం కోసం ఇటు బహుభార్యాత్వాన్ని చట్టబద్ధం చేసుకో వడం కోసం-మతం ముసుగు వేసుకోవడం- ఎలా నమ్ముతుంది? పై నుంచి ఆ మాట అన్నయ్య నోటి తోనే చులాగ్గా అనేస్తే..? వళ్లు మండిపోదూ....?

ఆనంద్ ఏదో సర్ది చెప్పాలని ప్రయత్నించేవాడు.

ఆనంద్ మీద విరుచుకుపడేదానిని " ఒక మగా డిలా మాట్లాడుతున్నావ్ నువ్వు" అంటూ

"అతను పిరికివాడు. పారిపోయాడు. ఒంట రిగా నిలబడలేక, నలుగురిలో తలెత్తుకోలేక"

"ఆ మాత్రం ధైర్యం నేర్పలేదా అతని రాజకీయ జీవితం? తనకు కావల్సిందేమిటో తనకే తెలియ నంత అమాయకంగా తీర్చిదిద్దిందా అతని సిద్ధాంతం? తన గురించే తనకు స్పష్టత లేనివా డుగా బాధ్యత లేనివాడుగా ఎలా తయారయ్యాడ సలు?"

"ఒప్పుకుంటాను... ఈ ప్రణాళికాబద్ధ సిద్ధాంత బోధనలన్నీ వ్యక్తి మానస చేతనను మేధోచింతనకు ఒక తాత్విక పునాది మాత్రమే. వ్యక్తి విలువలు అతని స్వతంత్ర ఆలోచనల్లోంచి రూపుదిద్దుకో వాలి. ఒక చట్రంలోకి మనిషిని బిగించలేం. బంధించలేం. ఒక చేతనావస్థ కలిగేలా ఒక వాతావ రణాన్ని మాత్రమే కలిగించగలం. మనిషి స్వేచ్ఛాభి లాషి. అంతఃశోధన, స్వీయసాధన లేనప్పుడు మనం ఎందుకు మాట్లాడుకోవడం?"

నిజమే, అన్నయ్య ఆదర్శాలు అలవాటుగా వచ్చినవే కానీ, మరొకటి కావు.

అన్నయ్య పూర్తిగా ఓడిపోయాడు. ఆయన ఓటమి మా కుటుంబానికి పెద్ద దెబ్బ.

ఆనంద్‌తో నా స్నేహం బలపడసాగింది. చెల్లెళ్ల చదువులు, పెళ్లిళ్లు పూర్తవగానే మేమిద్దరమూ ఒక కుటుంబంలో సిర్థపడాలనుకున్నాం. చిన్న చెల్లెలు పెళ్లికి వచ్చి మిత్ర బృందంతో సహా తిరిగి వెళ్లిన ఆనంద్ వారందరితో సహా మళ్లీ ఎవరి కంటపడ లేదు.

అజ్ఞాతంలోకి వెళ్లాడని అనుకొన్నాను. ఎప్పుడో ఒక రోజు నా ముందుకు హఠాత్తుగా వచ్చి నిలబడ తాడని అనుకొన్నాను. కానీ, ఏదో ఒక చిన్న పత్రి కలో ఒక మూలన రాసిన రెండు వాక్యాలలో అతను మలిగిపోయాడు.

ఈ దెబ్బలోంచి నేను తేరుకోలేకపోయాను.



## రోజ్‌బాత్

పసిడి వర్ణంలో మెరిసిపోయే దేహకాంతికీ, పాల నురగలాంటి యవ్వనానికి రోజ్ వాటర్ మంచి టానిక్ అంటే ఆశ్చర్యపోతున్నారా? అంతే కాదండోయ్ పడకగదిలో శ్రీవారి మదిని దోచేందుకూ గులాబీ రేకులు దోహదం చేస్తున్నాయి. ఓ బకెట్ నీటిలో గులాబీ రేకులను తుంచి వేసి ఓ పదినిముషాల తరువాత ఆ నీటితో స్నానం చేయడం వల్ల ముఖవర్చస్సు అద్భుతంగా ఉండటమే కాదు, శరీరం సువాసనలతో వుంటుంది. చాలా బ్యూటీ క్లినిక్‌లలో ఇలాంటి విధానాన్ని అనుసరిస్తున్నారు. కొత్తగా పెళ్లయిన వారు ఈ రోజ్ బాత్ చేయడం వల్ల మరింత ఆనందాన్ని పొందచ్చునేది బ్యూటీ ప్రొఫెషనల్స్ అభిప్రాయం.

లోలోన కుంగిపోసాగాను.

అమ్మా నాన్నలతో ఆనంద్‌తో నాకున్న సాన్ని హిత సంబంధం గురించి ఎప్పుడూ మాట్లాడలేదు. ఎందరో పార్టీ మిత్రులలో ఇతనొకడుగా భావించా రేమో. పార్టీకార్యకర్తలపై బహిరంగంగా దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్న రోజులవి. వాటిలో ఇదీ ఒక సంఘటనగా వారు భావించి వుండవచ్చు.

బహుశా అందువల్లనేమో రంజిత్ సంబంధం వచ్చినప్పుడు వారు వెంటనే సానుకూలంగా స్పందించారు. ఈడుజోడు సరిపోతుందని పెద్ద లందరి తీర్మానం. అమ్మానాన్నల వృద్ధాప్యం, వారి వేడికోళ్లు, నచ్చజెప్పడాలు-అయిపోయింది. అంతా అయిపోయింది.

అమ్మానాన్నలతో నా అభిప్రాయాలు చెప్పలేక పోయాను. అందరి తల్లిదండ్రుల్లాగే తమ బిడ్డా ఒక పరువైన కుటుంబ జీవితం గడపాలని ఆశిస్తు న్నారు. అవివాహితగా వుండిపోవాలన్న నా కోరి కను వారు జీర్ణించుకోనే స్థాయిలో లేరు.

అప్పుడే రంజిత్ సెలవులకు ఇంటికి వచ్చాడు. నా క్లినిక్‌లోనే మొదటిసారి కలిసారు. తరచూ కలు స్తూనే వున్నారు. రంజిత్‌లో నాకు అభ్యంతరం పెట్టాల్సిన అంశాలేవీ కనపడలేదు. అన్నయ్యలాగా ఆదర్శాలు వల్లించలేదు. కానీ రంజిత్ భావాలు సంస్కారవంతంగానే వున్నాయి.

అంతే, మా పెళ్లయిపోయింది.

అస్సాం, బర్మా బోర్డర్, మణిపురి పర్వతసాను వుల్లో మా సంసారానికి సౌందర్యమయ నేపథ్యాలై నిలిచాయి.

అన్ని అమరిన జీవితం. నాకు తెలియకుండానే నేను భద్ర మహిళనైపోయాను. అలసిన జీవి తంలోంచి ఈ కొత్త ప్రపంచంలోకి హాయిగా అడు గుపెట్టాను. అన్నయ్య, అమ్మానాన్న, ఆనంద్, పార్టీ, ప్రాక్టీసు- ఆటుపోట్లు నిరాశానిస్పృహ లు-అన్నీ ఒక్కొక్కటిగా కాలపు పొరల్లోకి ఇంకిపో యాయి.

ఒక నిత్య నూతన అనుభవం నా ముందు రస వంతంగా ఆవిష్కరించబడింది. అలా అని నేను భావించసాగాను.

నన్ను నేను క్రమక్రమంగా ఒక గృహిణిగా మలుచుకోసాగాను. రంజిత్‌కు ప్రీతిపాత్రంగా జీవించడమే నా జీవితమై పోసాగింది. ఇది రంజి త్‌కి బాగానే వుంది. త్వరలోనే చూడచక్కని జంటలా మంచి పేరు సంపాదించేశాం. ఒక, ఆ ఘనతను నిలబెట్టే బాధ్యతను నా భుజాలపై నిలు పుకున్నాను.

కడిగిన గిన్నెలే కడగడం, సర్దిన ఇంటినే సర్దడం, అమర్చిన వస్తువులనే అమర్చడం-రానురానూ శుభ్రవతిని అయిపోసాగాను. ఒక చిన్నపిల్లలా అన్నింటి కీ రంజిత్ నుంచి ఓ మెప్పుకోలును ఆశి స్తూ-రంజిత్ చుట్టూ బొంగరంలా తిరగసాగాను.

రంజిత్‌కి నచ్చిన వంటనే వండుతాను. తినే తిండినే తింటాను. అతనికి నచ్చిన తీరులోనే అలంకరణ చేసుకొంటాను. అతను చెప్పిన చీరనే సింగారిస్తాను. అతను కనుసైగ చేస్తే క్షణాల్లో ఆ పని పూర్తి చేసి శభాష్ అనిపించుకొంటాను. అతను మాట్లాడుతున్న వారితో మాట్లాడతాను. వద్దంటే మానేస్తాను. అలా అలా రంజిత్ నా ప్రపంచం అయిపోయాడు.

అలా ఒక రోజు ఇద్దరమూ సరదాగా ఒక పార్టీకి వెళుతుంటే కొందరు మణిపురి గిరిజన మహిళలు కనపడ్డారు.

మిలటరీ ఆఫీసర్ల కార్లను అటకాయిస్తూ...

వీధికి అడ్డంగా...

నగ్నంగా....

నేను నిర్ఘాంతపోయాను.

వారి భాష నాకు రాకపోవచ్చు. వారి చేతుల్లోని అట్టలపై ఏం రాసి వుందో నేను చదవలేకపోవచ్చు. కానీ, వారి కళ్లల్లోని ఆగ్రహం నా కంటపడకుండా పోలేదు.

వారి ముఖాల్లోని నిస్సహాయత, ఉద్వేగం, ఉద్రేకం, ఉత్తేజం-కలగలసిన ఒక వింత భావం నన్ను తాకకపోలేదు. నిలువెత్తు ప్రశ్నల్ని నిస్సిగ్గుగా నిలబెట్టారు వాళ్లు-నాగరీకులం అనుకుంటున్న వాళ్లందర్నీ.

రంజిత్‌ను అడిగాను. విషయం ఏమిటని?

మాట దాటవేయడమే కాదు. నన్ను ఇక మాట్లాడనీయలేదు.

మొదటిసారిగా నేను మనుషుల్లో పడ్డాను. నా సంసార మైకంలోంచి. నా దృష్టిని నా చుట్టూ సారించి చూడసాగాను. మ్యాగజైన్లు, వారపత్రికలు తిరగేసాను. ఆ స్త్రీల వేదన ఏమిటో అర్థం చేసుకోవడానికి నాకు ఎక్కువ సేపు పట్టలేదు.

వాళ్లని వెతుక్కుంటూ వెళ్లాను. సరిగ్గా అప్పుడే వారినందరినీ అరెస్ట్ చేసి వ్యానుల్లోకి ఎక్కిస్తున్నారు. టీవి కెమెరాలు,, పత్రికా విలేకరులు, మనుషులు-మిలటరీ!

ఆ దురాగత వ్యవస్థలో నా భర్త ఒక భాగం అన్న ఆలోచన నన్ను కుదిపేసింది. ఇలాంటి అమాయకుల కంటి నీటితో తడిసిన జీతం డబ్బులతో నేనొక భద్ర జీవితాన్ని మలుచుకున్నాను!సిగ్గుతో చితికిపోయాను. నిర్జీవమైనట్టుగా ఇంటికి తిరిగి వచ్చాను.

అప్పుడు తెలిసింది.

నాకు-రంజిత్ అంటే ఏమిటో!

మిలటరీ జులుం అంటే ఏమిటో!

నేను ఇంటికి తిరిగి వచ్చేలోగానే రంజిత్ ఏదో టీవి ఛానెల్లో నన్ను చూశాడట.

మరెవరో ఆఫీసర్ ఫోన్ చేసి రంజిత్‌ని 'భార్యను అదుపులో పెట్టుకో'మని హెచ్చరించారట. అంతే! ఎవరో తట్టి లేపినట్లుగా రంజిత్‌లోని ఒక భర్త... ఒక మిలటరీ ఆఫీసర్... ఒక్కసారిగా పడగవిప్పాడు. బుసలు కొట్టాడు. విషం చిమ్మాడు.

ఒకసారి టివి తెరపై చూశారో లేదో- ఎక్కడెక్కడి నుంచి వచ్చారో-శ్రేయోభిలాషులు-నన్ను రంజిత్‌ను విడదీసేస్తూ- మా ఇద్దరి నడుమ-అగాధాల సుడిగుండాలు సృష్టించేశారు.

నలుగురి నడుమ నన్నో పరీక్షకు నిలబెట్టారు. అణువణువునా...

నాపై నిఘా వేశారు. అనుక్షణం

నా ప్రతి కదలిక, ప్రతి పలుకూ, ప్రతి చూపు, ఆపై వారెవరి దృష్టి దాటలేదు. మానవ సంబంధాల ఉచ్చు బిగుసుకుపోయి నేనో మనిషినన్న విషయమే మరుగునపడిపోసాగింది.

నేనేమిటో- ఏమి చేస్తున్నానో- ఏమి ఆలోచిస్తున్నానో-అన్నీ మరిచిపోసాగాను.

''ఎంత పని చేశావ్? అతని ఉద్యోగం....అతని జీవితం....''

''ఇంత ఘోరమా? పోయి పోయి ఆ ఉద్యమకారులతో కలిసి వస్తావా?''

''పరువు ప్రతిష్ఠల సంగతి ఆలోచించావా? ఛీ ఛీ...సిగ్గు ఎగ్గు లేకుండా వాళ్లు రోడ్డు ఎక్కారే అనుకో తగుదునమ్మా అంటూ నువ్వెళ్లి తందానా కొడతావా?''

''మిలటరీ నియమ నిబంధనల విషయం ఆలోచించావా? అతని పీకల మీదకి తెచ్చావ్!''

రంజిత్ వైపు ఆశగా చూశాను.

''అయినా నేనేం చేశాను? ఒక్కమారు వారిని దగ్గరగా వెళ్లి చూడాలని ప్రయత్నించాను. వారి సమస్యలేమిటో తెలుసుకోవాలని అనుకున్నా. కనీసం వారి కంటినీరైనా తుడవలేదే? సాటి మనిషి నిస్సహాయ పరిస్థితిని ఒక మనిషిలా స్పందించడమేనా నేను చేసిన నేరం? ఘోరాతి ఘోరం?''

రంజిత్ సహాయం కోసం ఒక చిన్నపిల్లలా చూశాను. ఆయన సమాధానమే నాకు ఊరట.

ఊహూ!

అతను బిర్రబిగుసుకుపోయి వున్నాడు. తనలో తనే. చుట్టూ విరుచుకుపడుతోన్న మాటలన్నీ ఆయన శ్రద్ధగా ఏర్చికూర్చి పెట్టినట్టుగా..మౌనంగా...

నమ్మలేకపోయాను. ముక్కలు ముక్కలై పోయాను. అతని చుట్టూ పెనవేసుకున్న నా అనుభూతులు ఒక్కసారిగా విచ్చిపోయాయి.

నా రంజిత్! నేను ప్రేమించిన నా భర్త...నేను అనుక్షణం...అణువణువూ అపురూపంగా చూసుకున్న నా భర్త. ఎంతో గౌరవంగా నేను అభిమానించే నా భర్త.

నన్ను మురిపించి మరిపించిన నా రంజిత్!

ముద్దారగ చెప్పడానికి ఏం అడ్డొచ్చిందో. ఇలా నన్ను నలుగురి ముందుకు విసిరేశాడు. ఒక పులి విస్తరాకులా- ఒక ల్యాబ్ స్పెసిమన్‌లా

ఆ నలుగురు నన్ను నాలుగువైపులకూ లాగి లాగి చించేశారు. ఛిన్నాభిన్నం చేశారు.

ఆ నలుగురు నన్ను గుచ్చి గుచ్చి పరీక్షించారు. నా మానాభిమానాలతో పాటు నా ఆలోచనల అంతరాత్మనూ కుళ్ల బొడిచేశారు.

వారి తప్పేం లేదు.

వారి వారి చేతనాస్థాయి -అది!

కానీ, నన్ను ఎరిగిన నా మనిషి... ఇలా...!


తట్టుకోలేకపోయాను.

అగాధాల అడుగుల్లోకి...చీకటి గుయ్యారాల్లోకి...జారిపోసాగాను.

నిరాశా నిస్పృహ!

నిర్లిప్తమై మిగిలిపోసాగాను.

నా ప్రమేయం లేకుండా నా చుట్టూ ఒక వాతావరణం ఏర్పడుతోంది. అవాంఛనీయమైనది. నా వారంతా ఒక పక్షం. నేనొక పక్షం. రెండుగా విచ్చిపోసాగాం. దూరం క్రమక్రమంగా పెరగసాగింది.




నా శ్రేయోభిలాషులంతా ఎంతో సహృదయంతో సాయం చేయాలని వచ్చిన వారే.

కానీ, వారెవరికీ తెలియలేదు. అర్థం కాలేదు.

వ్యక్తిగా నాలో మూర్తిమత్వం చెందిన కొన్ని విలువలు నన్ను జీవింపచేస్తాయని. సహజ మానవ స్పందనలకు నేను బందీనని. వాటిని విడిచి నేను శ్వాసించలేనని. అవి లేని నేను నేను కానని...

నా అభిప్రాయాల కోసం ఎవరూ వేచి వుండలేదు. నా అనుభూతులు ఆలోచనలు ఎవరికీ అక్కర్లేదు. అవి పూచికపుల్లల పాటి చేయలేదు.

రంజిత్ సెలవు పెట్టేసి నన్ను ఢిల్లీకి తీసుకువచ్చేశాడు. ఆ తరువాత ఇక్కడికే ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు.

నన్ను అపరాధ భావనలోకి నెట్టేయాలన్న అందరి ప్రయత్నాలకు నేను ఒంటరిగా పోరాడుతూనే వున్నాను. క్రమక్రమంగా నా శక్తి యుక్తులు ఆవిరి అయిపోయాయి. నేను అలసిపోయాను.

ఎవరో పనిగట్టుకొని శ్రద్ధగా మడిచి మడిచి ఒక నాళికలో ఇమిడ్చినట్టుగా ఈ గాజు గదుల్లోకి కుంచించుకుపోసాగాను.

నిస్తేజమై మిగిలిపోసాగాను. నానాటికీ..

అయినా, నా వేళ్ల చివరన ఊపిరి ఆడుతుందేమో-నా ప్రమేయం లేకుండానే రేఖలు జాలువారుతున్నాయి. రంగులు దిద్దుకుంటున్నాయి. వెలుగులు నింపుకుంటున్నాయి. ఛాయలై మిగులుతున్నాయి.

నిజమే, ఎన్ని ప్రయత్నాలు చేశానో... ఎంత సంఘర్షణ పడ్డానో...ప్చ్...!

ఇంకా నేను తేరుకోలేదు. కొట్టుమిట్టాడుతూనే వున్నాను. కొడిగట్టిపోలేక...

అన్నయ్యకూ, ఆనంద్‌కూ, రంజిత్‌కు మధ్య ఎక్కడో తచ్చాడుతూ తడబడుతూ...

***

అపర్ణా రంజిత్‌కు ఎలా వీడ్కోలు పలికానో నాకు జ్ఞాపకం లేదు. ఎలా నా వర్క్‌డెస్క్ ముందుకు వచ్చి కూలబడ్డానో ఆ స్పృహే లేదు.

నిశ్శబ్దం... నా చుట్టూ... గాఢంగా... నిగూఢంగా....

నా ఎదురుగా కంప్యూటర్ తెరపై అపర్ణ కుంచెలో రూపుదిద్దుకున్న చిత్రం. డిజిటల్ ఇమేజ్‌ని క్లోజ్‌అప్‌గా జరుపుతూ- మరింత స్పష్టంగా చూడసాగాను.

ఎన్నెన్ని రంగుల మాటున ఛాయల్ని దాచి వుంచిందో... ఎన్నెన్ని నల్లని రేఖలలో వెలుగుల్ని వెతికి చూసిందో... అయ్యో! అపర్ణా....!

ప్రతి రేఖలో ప్రతి రంగులో ప్రతి కుంచె విసురులో- ఎంతటి జీవితేచ్ఛ! ఎంతటి స్వేచ్ఛాభిలాష!

వర్ణరంజితమైన ఆ చిత్రం. ఒక్కసారిగా వివర్ణమైనట్టుగా తోచింది.

వెలుగుల్ని వెలిసిపోయినట్లు



సింపుల్‌గా వుంటాడు - స్వీట్‌గా మాట్లాడతాడు

అతడో ముఖ్య మంత్రి కొడుకు కావచ్చు కానీ, రాణీముఖర్జీకి నచ్చిన వాడు కావడమే విశేషం. మహారాష్ట్ర ముఖ్యమంత్రి విలాసరావ్ దేశ్‌ముఖ్ కొడుకు రితేష్ రాణీకి తెగ నచ్చాడట. సింపుల్‌గా వుంటాడు, స్వీట్‌గా మాట్లాడతాడు. అతడు మాట్లాడే భాషలో చాలా రంగులుంటాయి. ఇంకా ఇంకా చెప్పాలంటే అతడిది ఛార్మింగ్ ఫేస్. బ్యూటిఫుల్ నడక అంటూ తెగ పొగుడుతోంది. ఇంకా చెప్పాలంటే బాలీవుడ్‌లో చాలా మంది వున్నారు గానీ, రితేష్ అంత స్మార్ట్‌గా ఎవరూ వుండరనేది నా అభిప్రాయం.. అంటూ రాణీ ముఖర్జీ మనసులోని భావాలన్నీ చెప్పేస్తోంది. కొంపదీసి లవ్ చేస్తోందో ఏమో?

గా... మసక మసగ్గా - తెరమీద చిత్రం అలుక్కుపోయింది...

ఆశ్చర్యం.

నా కంటిలో నీటి పొర.

ఇదేమి తెలియని వ్యథ కాదు.

అయినా తెలుసుకున్నప్పుడల్లా ఎందుకో కానీ, కళ్లు చెమ్మగిల్లడం మానలేదు.

అంటే, అపర్ణ అన్నట్టుగా, ఇంకా మనిషిగా నేను బ్రతికే వున్నాననన్నమాట! చెమ్మగిల్లిన కళ్లు, స్పందించని గుండె, సాటి మనిషిని స్పృశించని మనిషి మనుగడ ఎందుకు అంది ఆమె.

అవును. ఆ ఆలోచనతోనో ఆమె కుంగిపోయింది.

"అన్నీ తెలిసిన వారు కదా...మరి ఎందుకు. ఈ చీకట్లోంచి బయటపడడానికి ప్రయత్నం చేయలేదు?" మెత్తగా అయినా సూటిగా అడిగాను.

"చేశాను.. ఎన్నో ప్రయత్నాలు.... ఎందరెందరితోనో పోరాడాను. కానీ, వాళ్లంతా ఎవరు? నా వాళ్లు... అయినవాళ్లు... నన్ను కన్నవాళ్లు... నన్ను కట్టుకొన్న వాళ్లు... నేను కన్నవాళ్లు!"

"మీరొక డాక్టర్..."

"మరిచిపోయాను. ఆ తరువాత గుర్తొచ్చేసరికి ఏ ఒక్క జబ్బు గుర్తుకురాలేదు. చికిత్సలూ గుర్తుకురాలేదు. ఎంతో ప్రయత్నించాను. పుస్తకాల బూజులు దులిపి. ఒక్క ముక్క బుర్రకు పట్టలేదు. మరింత కుంగిపోయాను. నీకు తెలుసా- ఒకప్పుడు నేను అనాటమీలో గోల్డ్‌మెడల్ అందుకున్న విద్యార్థిని. ఒక శరీర భాగం గుర్తుకురావడం లేదు. ఎవరో శ్రద్ధగా తడిగుడ్డతో తుడిచేసినట్లుగా నా తలలోని దంతా మటుమాయం నేను. నిర్ఘాంతపోయాను. నిలబడిపోయాను. ఏకాకిగా..." అపర్ణ ఓ క్షణమాగి అన్నది "నేను క్లీనికల్‌గా డిప్రెషన్‌లోకి జారిపోయాను. నా ప్రొఫెసర్లు నా గాయం మాన్పలేకపోయారు. నేను కుంగిపోయాను. ముడుచుకుపోయాను! ఐ వజ్ క్లీనికల్లీ డిప్రెస్డ్"

నేను కళ్లు గట్టిగా మూసుకున్నాను. అపర్ణ మాటలు నన్ను చుట్టుముట్టేసాయి. తల విదుల్చుకొని సర్దుకొని కూర్చున్నా. చిత్రపు క్లోజ్ అప్ షాట్‌ని నాకు తెలియకుండానే శ్రద్ధగా చూడసాగాను. చాలా జాగ్రత్తగా....

దళసరి గాజుబీకరులో ఇమిడ్చి వుంచిన స్త్రీ

ఆమె శ్వాసిస్తూనే వుంది. ఆమె గుండె లయబద్ధంగా ధ్వనిస్తూనే వుంది.

ఆ రహస్యం నాకు మాత్రమే తెలుసు.

చిత్రం!

ఇంతవరకూ నా కంటపడని ఓ సన్నని పగులు- ఆగాజు బీకరు మీద

ఆ దళసరి గాజు బీకరు విచ్చిపోతోంది. ఆ సజీవ స్త్రీ మూర్తి రెక్కలు విప్పుకున్నట్లుగా పైకి కనపడుతోంది. చిరునవ్వుతో...

కళ్లు చికిలించి చూశాను.

అలాంటిదేమీ లేదు.

అది మామూలుగానే వుంది.

చిత్త భ్రమ...వట్టి భ్రాంతి.

"బీ ప్రొఫెషనల్" నా భుజం నేనే తట్టుకొని నాలోకం లోకి వచ్చిపడ్డాను. అయినా. అపర్ణ మాటలు నా చుట్టూ...నాలోలోన

"అన్నయ్యలా పారిపోలేకపోయాను. ఆనంద్‌లా అమరత్వం పొందలేకపోయాను. రంజిత్‌లా వ్యవస్థీకృతమై రాజీ పడలేకపోయాను. అయినా, నేను జీవించే వున్నాను. జీవిస్తూనే వున్నాను"

చెవులు గట్టిగా మూసుకొని డెస్క్‌పై తలవాల్చాను.

ఢామ్మని శబ్దం.

నా చిన్ననాటి స్నేహితురాలు అపర్ణ

అరెరే...అలా భద్రంగా మోసుకువస్తోన్న బీకరుతో సహా- ఎదురుదెబ్బ తగిలి ముందుకి పడిపోయిందే! పదిలంగా పట్టుకొస్తున్న ఆ జీవరహితమైన హృదయం అలా ఛిద్రమై ఛిన్నాభిన్నమై పోయిందే...! అయ్యయ్యో! గుండెలో గుచ్చుకున్న ఆ సన్నటి గాజుముక్కల్ని జాగ్రత్తగా తీయాలి సుమా...!

ఆమె చిన్నారి అపర్ణా? ఏమో?

కాకపోవచ్చు. అపర్ణా రంజిత్

అవును. ఆమె ప్రతి పలుకూ నాలోకి ఇంకిపోయింది.

"ఆనంద్ పోరాడి ప్రాణమొడ్డి తనవారిలో వీరుడయ్యాడు.

క్షణక్షణం మరణిస్తూ నా వారందరితో పోరాడుతునే వున్నా-"

ఫెటిల్మని శబ్దం!

గాజు బీకరు భళ్లున బద్దలయ్యింది!

ఈసారి నిజంగానే!!

ఎక్కడో తెలియదు కానీ...

వేడెక్కిన గాజులై చల్లటి నీటి చుక్క-

ఒకే ఒక్కటి

అంతే-!!!

★